సమన్వయంతో పనిచేసి
విజయఢంకా మోగిద్దాం

- పార్టీ విజయానికి గృహ సారథులు సైనికుల్లా పనిచేయాలి
- టీడీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

పామూరు: గృహ సారథులే వైఎస్సార్ సీపీకి రథ సారథులని, సమన్వయంతో సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో కూడా కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక సత్యనారాయణస్వామి కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ, కులం, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ధర్మపాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గడచిన మూడేళ్ల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజలకు వివరించి ప్రజల హృదయాల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంపొందించాలన్నారు. గృహసారథులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఎక్కడైనా అవినీతి జరుగుతున్నట్లు, సచివాలయ సిబ్బంది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుర్తిస్తే ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

టీడీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

టీడీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని ప్రజల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 14 ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి శూన్యమని చెప్పుకోవడానికి ఏం లేకపోవడంతో వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, కో ఆప్షన్ నాయబ్‌రసూల్, వైస్ ఎంపీపీ షేక్.రషీద్, గంధం ఏసురత్నం, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, సర్పంచ్ రాగమ్మ, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, కందుల శ్రీను, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జే.గోవిందయ్య, బి.మార్కు, మండల మహిళాధ్యక్షురాలు జమీలా, పద్మ, చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేస్తున్న సేవలను ప్రజలకు చెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మానుగుంట

- వైద్యసేవలు ప్రజలకు తెలియాలి
- హాస్పిటల్ పనితీరుపై విమర్శలు వస్తే వైద్యులే సమాధానం చెప్పాలి
- ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న సేవల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, లేకుంటే కొన్ని అపోహలు ప్రజల్లో వ్యాపించే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం స్థానిక హాస్పిటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్పిటల్ పనితీరుపై వచ్చిన విమర్శలపై వైద్యాధికారులే సరైన సమాధానం చెప్పాలన్నారు. ఏ సేవలు అందిస్తున్నామని, అందుబాటులో ఉన్న డాక్టర్‌లు వంటి వివరాలు అన్నీ ప్రజలకు తెలియజేయాలన్నారు. అందిస్తున్న వైద్య సేవల గురించి కూడా ప్రజలకు చెప్పుకోలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వైద్యసేవలు అందించడంలో ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ఇంత మంది డాక్టర్‌లు, అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడు రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయాల్సిన అవసరం లేదన్నారు. హాస్పిటల్ బాధ్యతలు చూస్తున్న వైద్యులు హాస్పిటల్‌లో ఉన్న సౌకర్యాల గురించి స్పష్టంగా ప్రజలకు చెప్పాలని సూచించారు. అలాగే శానిటేషన్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని ఎలక్ట్రీషియన్‌గా పనిచేయిస్తున్నామని, అదనంగా నెలకు రూ.5500 జీతంగా మంజూరు చేయాలని ప్రతిపాదించడం పట్ల ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. శానిటేషన్‌లో పనిచేసే వ్యక్తిని ఎలక్ట్రీషియన్‌గా ఉపయోగిస్తే అక్కడ కొరత ఉంటుంది కదా అని ప్రశ్నించారు. అలాగే క్వాలిఫైడ్ కాని వ్యక్తి చేత ఎలక్ట్రికల్ పనులు చేస్తే ఏదైనా సమస్య వస్తే ఎవరు సమాధానం చెప్తారన్నారు. దీనిపై స్పందించిన డాక్టర్‌లు అతనికి ఎలక్ట్రికల్ పనులు తెలిసి ఉండడంతో తాత్కాలికంగా పనులు చేయిస్తున్నామని, ఎలక్ట్రీషియన్ పోస్టు మంజూరైన తరువాత శాశ్వత ప్రాతిపాదికనన క్వాలిఫైడ్ వ్యక్తిని నియమిస్తామని చెప్పారు. అప్పటి వరకు అత్యవసర పరిస్థితి సమయంలో సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు అదనపు జీతం ఇచ్చి పనులు చేయిస్తున్నామని చెప్పారు. అలాగే అత్యవసర కానీ అంశాలను కూడా ఎజెండాలో ఎందుకు చేర్చుతున్నారని, నెలవారీ సమావేశాల్లో ఎందుకు ఆ అంశాలను ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. హెచ్‌డీఎస్ సమావేశాలకు వచ్చేటప్పుడు హాస్పిటల్ వైద్యాధికారులు అన్ని ఆధారాలతో సమావేశాలకు రావాలని సూచించారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ శోభిక, హాస్పిటల్ సూపరింటెండెంట్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలో ఈ నెల 10వ తేదీ వరకు గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ ఓ ప్రకటనలో కోరారు. గురువారం తూమాడు, సతుకుపాడు, వర్ధినేనిపాలెం, 10వ తేదీ శుక్రవారం పాలేటిపాడు, సతుకుపాడు, వర్ధినేనిపాలెంలో ఆధార్ మొబైల్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో నూరు శాతం ఆధార్ నమోదు లక్ష్యాన్ని సాధించడమే లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు.

40 మందికి నేత్ర వైద్య పరీక్షలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని చంద్రబాబు కాలనీలో పీహెచ్‌సీ వైద్యులు బుధవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. కంటి వైద్యుడు డాక్టర్ చంద్రశేఖర్ 40 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 10 మందికి కళ్ల జోళ్లు అవసరమని సిఫార్సు చేశారు. ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌ఆలీ, ఎంఎల్‌హెచ్‌పీ కుష్బూ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి రూరల్: మండలంలోని నందనమార్లె సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పట్టణంలోని పవిత్ర ఫంక్షన్ హాల్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ పరిధిలో కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. కొత్త లైన్ ఏర్పాటు, మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సద్దుమణిగిన శ్మశాన వాటిక సమస్య

కనిగిరి రూరల్: మృతదేహం పూడ్చివేత విషయంలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదానికి అధికారులు తెరదించారు. మండలంలోని భూతంవారి పల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎం అంకయ్య(64) మృతి చెందాడు. అయితే గ్రామ శివార్లలోని గతంలో పూడ్చుతున్న ప్రదేశాల్లోనే మృతదేహాన్ని ఖననం చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ ప్రదేశం తమ పట్టా పొలం భూమి (సెటిల్‌మెంట్)లోనిదని, మాకు అన్ని హక్కులున్నాయని గ్రామానికి చెందిన నాగార్జున మరికొందరు అడ్డుకున్నారు. దీంతో సమస్య తలెత్తింది. సీఐ పాపారావు, తహసీల్దార్ యు పుల్లారావు సంఘటనా స్థలానికి వెళ్లారు. అదే ఏరియాలోని పక్కన ప్రదేశంలో మృతదేహాన్ని పూడ్చించి సమస్యను సద్దుమణిగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ యు పుల్లారావు మాట్లాడుతూ పాస్‌పుస్తకాల ప్రకారం నాగార్జున (సెటిల్ భూమిని) పొలం కొలతలు వేసి హద్దులు నిర్ణయించి వివాదం లేకుండా చేస్తామన్నారు. ఎస్సీల శ్మశాన వాటికకు ఇబ్బంది లేకుండా స్థల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయండి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

మర్రిపూడి: సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలోని సచివాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని చెప్పారు. మరణించిన వ్యక్తుల పేర్లు రేషన్ కార్డుల నుంచి తొలగించాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. మరణించిన వారి పేర్లు కార్డులో ఉండటం వల్ల వితంతువులు, వృద్ధులు పింఛన్లు పొందలేకపోతున్నారన్నారు. ఆయన వెంట మారెడ్డి సుబ్బారెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

వర్గీకరణ చేయాలని చూస్తే బుద్ధి చెబుతాం

కందుకూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ బెదిరింపులకు లొంగి ఎస్సీ వర్గీకరణ చేయడానికి ప్రయత్నిస్తే తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. స్థానిక అదిత్య ఫంక్షన్ హాలులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. మాల ఉద్యోగుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి పాలేటి కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు, పి. బాలకోటయ్య, పంది కోటేశ్వరరావు, గంగోలు మాల్యాద్రి పాల్గొన్నారు.

స్వర్గధామం అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

కనిగిరి రూరల్: పట్టణంలోని గార్లపేట రోడ్డులోని కనిగిరి స్వర్గధామం (హిందూ శ్మశాన వాటిక) అభివృద్ధికి ఇస్కాన్ కమిటీ సభ్యులు గుత్తి శ్రీధర్, సతీమణి సుజాత రూ.10 లక్షల విరాళం ప్రకటించినట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, సిరుప గోవర్ధన్‌రెడ్డి, తాళ్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం దాత గుత్తి శ్రీధర్‌ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వాగిచర్ల వెంకటేశ్వర్లు, నార్లపాటి మల్లికార్జున, దోసపాటి మహేష్‌రెడ్డి, కొలిపర్తి వెంకటస్వామి, ముచ్చర్ల ధర్మరావు, ముత్యాల శ్రీనివాసులరెడ్డి, సోమిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

టంగుటూరు: ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఖాదర్‌బాషా హెచ్చరించారు. టంగుటూరులో వాహనాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పొలం పనులకు వెళ్లే కూలీలను ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించడం వల్ల అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఓవర్ లోడుతో ప్రయాణిస్తున్న 30 ఆటోలపై కేసులు నమోదు చేశారు.

ఆరు రేషన్ దుకాణాలపై 6ఏ కేసులు నమోదు

టంగుటూరు: మండలంలోని ఆరు రేషన్ దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. రేషన్ దుకాణాలపై మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు తహసీల్దార్ చిరంజీవి, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. టంగుటూరు దుకాణం 2లో 15 బస్తాల బియ్యం, చక్కెర, కందిపప్పు, 6లో 20 బస్తాల బియ్యం, చక్కెర, కందిపప్పు, 8లో 100 బస్తాల బియ్యం, చక్కెర, కందిపప్పు, అలాగే ఎం.నిడమానూరు–31 దుకాణంలో 12 బస్తాల బియ్యం, చక్కెర, కందిపప్పు, 33వ నంబర్ దుకాణంలో 45 బస్తాల బియ్యం, చక్కెర, కందిపప్పు, 48వ నంబర్ దుకాణంలో 6 బస్తాల చక్కెర, కందిపప్పు సీజ్ చేశామని వివరించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని వీఆర్వోలకు అప్పగించామని తెలిపారు.

పాలవెల్లువ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

- డీఆర్డీఏ పీడీ బడుగు బాబురావు

టంగుటూరు: జగనన్న పాలవెల్లువ కేంద్రాలు సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీ బడుగు బాబురావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో సమీక్ష సమావేశంలో పీడీ మాట్లాడారు. మండలంలో స్వయం సహాయ సంఘాలకు 50 గొర్రె పిల్లల యూనిట్లు, 30 పాడి గేదెల యూనిట్లు అందజేయాలని చెప్పారు. చేయూత మహిళా మార్టులో పొదుపు గ్రూపుల మహిళలకు తక్కువ ధరకు నిత్యావసర వస్తువులు ఇప్పించే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయించాలన్నారు. చిరు వ్యాపారులకు జగనన్న తోడు కింద రూ.10 వేలు రుణం ఇప్పించాలని చెప్పారు. ఎంపీడీఓ అజిత, డీపీఎం పి. సనిత, కొండపి ఏసీ గుంజి రాంబాబు, ఏపీఎం గంటా శ్రీనివాసరావు, సీసీలు, వీఓఎలు పాల్గొన్నారు.

ఈ క్రాపు నమోదులో తప్పులు లేకుండా చూడాలి



వరిపంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

సీఎస్‌పురం: ఈ క్రాపు నమోదులో తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. సీఎస్‌పురంలో బుధవారం ఈ క్రాప్ సూపర్ చెకింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ క్రాపు నమోదులో సాగు చేసిన పంట, విస్తీర్ణం, సంబంధిత రైతు పేరు కరెక్టుగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాదవరావు, ఆర్ఐ మల్లికార్జునరావు, వీఆర్ఓలు మనోజ్, శ్రీనివాసులు, వీహెచ్ఏ శారద పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కందుకూరు రూరల్: మండలంలోని పందలపాడులో గురువారం ఉదయం 8:30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారని, అన్ని శాఖ మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు బుధవారం ఏపీఓ వినయ్ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు పనులను తనిఖీ చేస్తూ మస్టర్లను పరిశీలించాలన్నారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వద్దు



హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

- ఏరియా హాస్పిటల్‌ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

కందుకూరు: రోగులకు అందించే సేవల్లో అలసత్వం వహించవద్దని సబ్ కలెక్టర్ శోభిక అన్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్‌ను బుధవారం సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. అత్యవసర చికిత్సా విభాగంతో పాటు, రోగులు ఉండే వార్డులు, డయాలసిస్ కేంద్రాలను తనిఖీ చేశారు. డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే హాస్పిటల్‌లో రోగులకు అందిస్తున్న సేవలను, ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రంలో ఎంత మందికి డయాలసిస్ చేస్తున్నారు, ఎన్ని షిఫ్ట్‌ల్లో చేస్తున్నారని ఆరా తీశారు. ప్రస్తుతం 300 మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నారని, ప్రతి షిఫ్ట్‌లో 30 మందికి డయాలసిస్ చేస్తున్నట్లు కేంద్రం సిబ్బంది తెలిపారు. అలాగే ప్రతి రోజు మూడు షిఫ్ట్‌ల్లో డయాలసిస్ జరుగుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్‌కల్టెకర్

కందుకూరు అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సబ్ కల్టెకర్ శోభిక అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట, వరాల సాయినగర్, మహదేవపురం లేఅవుట్‌లో జరుగుతున్న బుధవారం ఇళ్ల నిర్మాణాల పనులను పరిశీలించి ఇళ్ల నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ శోభిక మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇంటి నిర్మాణం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని, ఉగాది నాటికి టార్కెట్ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని, సమస్యలుంటే తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. తహసీల్దార్ సీతారామయ్య, కమిషనర్ ఎస్. మనోహర్, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

వలేటివారిపాలెం: మండలంలోని కూనిపాలెం, కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ సునీత బుధవారం తనిఖీ చేశారు. కూనిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిష్టర్, సిబ్బంది రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు ఆటలతో పాటు ఇంగ్లిష్‌లో విద్యా బోధన చేయాలన్నారు. కొండసముద్రం కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన భోజనం పెట్టాలని సూచించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయించాలని పిల్లలకు ఆరోగ్యకరంగా చూసుకోవాలన్నారు. కేంద్రాలను సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంక్షిప్తంగా

31 గ్రామాల్లో విద్యుత్ తనిఖీలు

కందుకూరు రూరల్: మండల పరిధిలోని 31 గ్రామాల్లో విద్యుత్ డీఈ అత్తంటి వీరయ్య, విజిలెన్స్ డీఈ తోట శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 32 బృందాలుగా ఏర్పడి 2668 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారు. మీటరు లేకుండా విద్యుత్ వాడుకునే కేసులు ఆరు, ఇంటి మీటరు తీసుకుని వ్యాపారాలకు వాడుకునే కేసులు నాలుగు, అదనపు లోడు వాడుకునే కేసులు 56 మొత్తం 66 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి అపరాధ రుసుం కింద రూ.2,05,000 విధించామన్నారు. తనిఖీల్లో ఏడీ ఎం.శ్రీనివాసులు, కందుకూరు ఏడీ ఆర్.విజయ్‌బాబు, సింగరాయకొండ ఏడీ పి.యుగంధర్, కందుకూరు రూరల్ ఏఈ సీహెచ్.రమేష్‌బాబు, డివిజన్ పరిధిలోని ఏఈఈలు మధుబాబు, శ్రీనివాసరావు, సాయి శివరావు, కోటయ్య, నరసింహం, ఫిరోజ్, హర్దీస్, లైన్ విజిలెన్స్ ఏడీ ఏ.శ్రీనివాసులు, ఏఈ పి.మౌలాలిఖాన్ నాగరాజులు పాల్గొన్నారు.

సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభం



సచివాలయం ప్రారంభోత్సవంలో నేతలు

గుడ్లూరు: మండలంలోని బసిరెడ్డిపాలెంలో రూ.58 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎంపీపీ పులి రమేష్, సర్పంచ్ డేవిడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, రాళ్లపాడు సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు మాల్యాద్రిరెడ్డి, రమణయ్య, క్రిష్టారెడ్డి, వైస్ సర్పంచ్ విఠల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, క్రిష్ణ పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కనిగిరి రూరల్: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలు ఈనెల 15 నుంచి 20 వరకు బిహార్‌లోని పాట్నాలో జరుగుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలూరి రమణారెడ్డి తెలిపారు. మహాసభలకు రాష్ట్రం నుంచి 50 మంది ప్రతినిధులు హాజరవుతుండగా, జిల్లా నుంచి తాను ప్రతినిధిగా హాజరవుతున్నట్లు వెల్లడించారు. వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు.

మహాశివరాత్రికి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధ్యక్షుడు మల్లికార్జున, ఈఓ సత్యన్నారాయణ

కనిగిరి రూరల్: మహాశివరాత్రికి ఏర్పాట్లను బుధవారం ఆలయ కమిటీ, అధికారులు పరిశీలించారు. ఈ నెల 17 నుంచి 21 వరకు కనిగిరి కొండపై కొలువై ఉన్న పార్వతి సమేత విజయ మర్తాండేశ్వర స్వామి దేవస్థాన మహా శివరాత్రి ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు గొంట్ల మల్లికార్జునరావు, కార్యనిర్వాహణ అధికారి గర్రె అనంత సత్యన్నారాయణ పరిశీలించారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవ ఏర్పాట్లపై చర్చించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు గొంట్లా మల్లికార్జునరావు కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

కందుకూరు: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించడం ద్వారా భూమిలో కర్బన శాతం పెరిగి నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఎం డి.మాలకొండయ్య అన్నారు. ఏపీసీఎన్ఎఫ్ సహకారంతో స్థానిక సీటీఆర్ఐ–కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు రెండు రోజులపాటు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఉపయోగించే సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. ఘన జీవామృతం, బీజామృతం, వివిధ రకాల కషాయాలు, దశపర్ణి కాషాయం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, గంజి ద్రావణం వంటివి తయారు చేసే విధానంపై రైతులకు వివరించారు. ఈ సేంద్రియ ఎరువులు, కషాయాలు వినియోగించి వ్యవసాయం చేయడం వల్ల రైతులు చీడపీడల నుంచి రక్షణ పొంది మేలు రకం దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. సీటీఆర్ఐ–కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం అనూరాధ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆపరేషన్

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న ఉలవపాడులోని వరిగచేను సంఘానికి చెందిన రెండేళ్ల యశ్వంత్ అభిరామ్‌కు దాతల సాయంతో మంగళవారం రాత్రి విజయవాడలో వైద్యులు ఆపరేషన్ నిర్వహించి చీముగడ్డలు తొలగించారు. ప్రాణాపాయం తప్పిందని మరో 10 రోజుల పాటు వైద్యశాలలోనే ఉండాలని వైద్యులు చెప్పినట్లు తండ్రి మురళితెలిపారు. దీనిపై సాక్షిలో వచ్చిన చిన్నారికి పెద్దజబ్బు, ఆయుష్షు పోయండి కథనాలకు మానవతావాదులు స్పందించారు. తొలిరోజు రూ.41 వేలు రాగా తరువాత మంగళ, బుధవారాలలో కలిపి రూ.35 వేలు అందించారు. వరిగచేనుసంఘం గ్రామస్తులు రూ.20 వేలు అందించారు. ఉలవపాడులోని తిరుమల ఎలక్ట్రానిక్స్ శ్రీకాంత్ అతని మిత్రులు, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న విజయ్ అతని మిత్రులు కలిసి రూ.40 వేలు అందించారు. వైద్యశాలలో ఆపరేషన్ నిర్వహించారు. ఇప్పటి నుంచి 11 రోజుల పాటు జరిగే వైద్యంతో పాటు పాత బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న మధుబాబు

కందుకూరు రూరల్: పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఇంటర్మీడియెట్ వృత్తి విద్యాధికారి మధుబాబు అన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవ వేడుకలు బుధవారం కాలేజీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా రెండు నెలల పాటు సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టాలని సూచించారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా టీఆర్ఆర్ కాలేజీ విద్యార్థులు మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. అనంతరం విద్యలో, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాలేజీ ప్రిన్సిపాల్ కదిరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సింగరాయకొండ, కనిగిరి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌లు రమణారెడ్డి, ఐ వెంకటేశ్వరరావు, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు డి.అనూరాధ, జి మాల్యాద్రి, కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్
90102 24456

Office mail : sakshiongads@gmail.com